క్లుప్తంగా

నవోదయ ప్రవేశాల దరఖాస్తుకు గడువు పెంపు

మదనపల్లె సిటీ: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల ప్రవేశానికి ఎంపిక పరీక్ష దరఖాస్తుకు గడువు పెంచినట్లు మదనపల్లె నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం.గీత తెలిపారు. ఈనెల 21వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు


కే.రాజశేఖర్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: స్థానిక పీఏసీఎస్ (సొసైటీ బ్యాంకు) పర్సన్ ఇన్‌చార్జిగా కే.రాజశేఖర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టినట్లు బ్యాంకు సీఈఓ చంద్రశేఖర్ తెలిపారు. ఈయన మదనపల్లి సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారిగా, అసిస్టెంట్ సబ్ రిజిస్టార్‌గా పని చేస్తూ ఇక్కడ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 76 సొసైటీ బ్యాంకులు ఉండగా 90 శాతం సొసైటీల్లో నామినేటెడ్ ద్వారా ఎన్నికైన త్రీమెన్ కమిటీ సభ్యులు కొనసాగుతుండగా కేవలం ఒక్క తంబళ్ళపల్లి, మదనపల్లి నియోజకవర్గాల్లోని ఒక్క సొసైటీలో కూడా త్రీమెన్ కమిటీ నియామకం జరగకపోవడం గమనార్హం.

క్యాంపస్ ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

మదనపల్లె సిటీ: స్థానిక పుంగనూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం విస్టాండ్ ఫర్ యు సొల్యూషన్స్ సంస్థ క్యాంపస్ వారు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు వివిధ విభాగాల నుంచి 10 మంది విద్యార్థులు 3.5 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు హెచ్‌ఆర్ మేనేజర్ తేజస్‌గౌడ తెలిపారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, కాలేజీకి మంచి గుర్తింపు తీసుకువాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి అన్నాభిషేకం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి అన్నాభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ అన్నాభిషేకంతో స్వామికి నివేదించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ అన్నాభిషేకం చేశారు. భక్తులకు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

స్మశాన వాటికకు స్థలం ఎంపిక


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివకుమార్

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీ హరిజనవాడకు స్మశాన స్థలాన్ని కేటాయిస్తున్నట్లు తహసీల్దార్ ఎం. శివకుమార్ అన్నారు. మంగళవారం గ్రామంలో స్మశాన వాటికకు అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తలపుల – యల్లమంద రహదారికి అనుకూలంగా సర్వే నెంబరు 882లో 30 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు ప్రతి పాదనలు పంపుతున్నామని, అనుమతి రాగానే దారి సౌకర్యం, ప్రహరీ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు బోదేషావలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిని పట్టించుకోరా ?


మాట్లాడుతున్న ఎంపీపీ పూర్ణచంద్రిక

పెద్దమండ్యం: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా ఆర్ అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని మంగళవారం జరిగిన మండల మీట్‌లో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ పూర్ణచంద్రిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పెద్ద మండ్యం సర్పంచ్ బాష మాట్లాడుతూ స్థానిక కుషావతీనదిపైన బ్రిడ్జి నిర్మాణం, విద్యా నగర్ కాలనీలో జెండా మాను వద్ద రోడ్డు గుంతలు పడినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గండికోట రిజర్వాయర్ నుండి కలిచెర్లలో నిర్మించుకున్న సంపుకు నీళ్లు రావడం జరుగుతుందని దీని వల్ల తాగునీటి సమస్య లేకుండా పోతుందన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, విద్యుత్‌శాఖ ఏఈ రామ్మూర్తినాయక్, ఏపీఓ సురేందర్ రెడ్డి , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం


నిమ్మనపల్లె: వాల్మీకి జయంతి నిర్వహిస్తున్న వాల్మీకి నాయకులు


పీలేరు ప్త వాల్మీకి మహర్షి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మదనపల్లె రూరల్ : రామాయణ మహాకావ్య రచయిత వాల్మీకి మహర్షిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్‌వలీ అన్నారు. మంగళవారం పట్టణంలోని రాగిమానుసర్కిల్ వద్ద వాల్మీకి మహాసేన స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తరాశి హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి రామాయణ గ్రంథాన్ని రచించి పరిపూర్ణమైన విలువలను సమాజానికి అందించారని కొనియాడారు. మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శాలను మనిషికి అడుగడుగునా బోధించేలా రామాయణ కావ్యాన్ని రచించారని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకులు, వాల్మీకి మహాసేన నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ జీవితానికి దారి చూపేదే రామాయణం

నిమ్మనపల్లె : అద్భుత కావ్యం పురాణ ఇతిహాసమైన రామాయణం ఆదర్శ జీవితానికి దారి చూపుతోందని, అలాంటి మహా గ్రంథాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని వాల్మీకి నేతలు అన్నారు. మంగళవారం మండలంలోని నిమ్మనపల్లె, దిగువ పల్లె గ్రామాలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిమ్మనపల్లెలో బస్టాండ్ నుంచి పాత బస్టాండు దిగువ వీధి కందూరు రోడ్డు ఇండియన్ బ్యాంక్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ లో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దిగువ పల్లెలోని వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి నాయకులు మాట్లాడుతూ... వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శవంతమైందన్నారు. వాల్మీకుల చిరకాల వాంఛ అయిన ఎస్టీ పునరుద్ధరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా పరిగణించి నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బీసీ సాధికార సమితి కన్వీనర్ లక్ష్మన్న, మాజీ జెడ్పీటీసీ వెంకటకృష్ణ, వాల్మీకి నాయకులు గోపాలకృష్ణ, చెంద్రా యుడు, భాస్కర, కిట్టి, రమణ, సహదేవ, వెంకటరమణ కృష్ణయ్య, టీడీపీ నాయకులు మునిరత్నం మల్లికార్జున, చిన బాబు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పీలేరు రూరల్ : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం ముఖ్య నాయకులు గుండ్లూరు మురళి, రెడ్డెప్ప, చెంగల్‌రాయులు అన్నారు. మంగళవారం వాల్మీకిమహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో పునరుద్దరణే ధ్యేయంగా పోరాటాలు చేస్తామని తెలిపారు. ప్రధాన రాజకీయ పార్టీలు వాల్మీకిసామాజిక వర్గాన్ని ఒక ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకోకపోవడం అత్యంత బాధాకరమన్నారు. శీతాకాల సమావేశాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్ బాబు, నాయకులు గురుమోహన్, వారాది వెంకటరమణ, మురళి, శీన, ప్రసాద్, సుబ్రమణ్యం, బోయపల్లె మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వాల్మీకి జీవితం మానవాళికి ఆదర్శమన్నారు.

కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

మదనపల్లె రూరల్ : పట్టణంలోని మదనపల్లె కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 25న జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్ ఉత్తర్వుల్లో మదనపల్లె సబ్–డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్టార్ కే.రాజశేఖర్ రెడ్డిని ఎన్నికల అధికారిగా నియమించారు. ఎన్నికల షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా మంగళవారం పర్సన్ ఇన్‌చార్జ్ ఏ.ప్రవీణ్ కుమార్, స్థానిక కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో ఓటరుజాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ఈనెల 13 వరకు సభ్యులు ఓటరుజాబితాపై ఏవేని అభ్యంతరాలు, క్లెయిమ్స్ ఉంటే తెలపాలన్నారు. 14న అర్హుల ఓటరుజాబితాను ఎలక్షన్ ఆఫీసర్‌కు అందించడం జరుగుతుందన్నారు. 18న ఎలక్షన్ ఆఫీసర్ తుది ఓటరుజాబితా, ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటిస్తారన్నారు. 22న నామినేషన్లు, 23న స్క్రూటినీ, 24న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అభ్యర్థులు పోటీలో ఉంటే, 29న పోలింగ్ నిర్వహించి, మరుసటి రోజు కౌంటింగ్ నిర్వహించి తుది ఫలితాలను ప్రకటిస్తామన్నారు. ఈ సందర్భంగా హౌస్ బిల్డింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ ఏ.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ...కార్యాలయ నోటీసుబోర్డులో ప్రదర్శించిన ఓటరుజాబితాలో సభ్యులు తమ పేర్లను పరిశీలించుకోవాలన్నారు.

నేరాల నియంత్రణకు రాత్రిగస్తీ పెంచండి

జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి


కలకడ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

కలకడ : నేరాలు, చోరీల నియంత్రణకు పోలీసులు రాత్రి గస్తీ పెంచాలని జిల్లా పోలీస్ అధికారి (ఎస్పీ) ధీరజ్ కునుబిల్లి ఆదేశించారు. మంగళవారం కలకడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి స్థానిక ఎన్నికలపై పోలీసులకు అవగాహన పెంచేల చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ట్రాఫిక్ రద్దీ అన్ని రోడ్డు మార్గాల్లో పెరిగిందని గుర్తు చేశారు. చిన్నారులకు వాహనాలు ఇచ్చినా, హెల్మెంట్ లేకుండా వాహనాలు నడిపినా జరిమానాలు తప్పవన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. కేసుల పురోగతి, క్రైం రేటు తగ్గించడానికి ప్రయ్నతం చేయాలని అన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫిర్యాదు దారులపై పోలీసుల గౌరవం పెరగాలని సూచించారు. ప్రతి చిన్న గ్రామంలో కూడా సైబర్‌నారగాళ్ల బారిలో పడిన యువత ఎంతో మంది ఉన్నారన్నారు. సైబర్‌నేరాల నియంత్రణకు అవగాహన ఒక్కటే మార్గమన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మన్న, ఎస్ఐ రామాంజనేయులు, ఏఎస్ఐ మల్లికార్జున సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దసరా పూజలు


దసరా ఉత్సవాలలో వాల్మీకిపురం పంచాయతీ అధికారులు, కార్మికులు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం దసరా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుద్ధ్య వాహనాలకు పూజలు నిర్వహించారు. సర్పంచ్ గంగులమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలలో ఎంపీడీఓ మనోహర్ రాజు, డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఈఓ రవీంద్రనాథ్, సిబ్బంది నరేష్, సురేష్, శ్రీరాములు, వెంకటేష్, శివ, వసంతమ్మ, రాజు, కుమార్, కీర్తన, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కలికిరి పంచాయతీ కార్యాలయంలో.

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం దసరా ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి చిత్రపటం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాహనాలకు, ఇతర పనిముట్లకు ఆయుధ పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, సర్పంచ్ ఎల్లప్ప, ఈఓ అశోక్, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్‌రెడ్డి, సిబ్బంది కీర్తన, కరుణాకర్, మేస్త్రీ వెంకటముని, ముబీనా, శ్రీనివాసులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి క్షమార్హం కాదు

– వీసీకే పార్టీ రాష్ట్ర నేత పీటీఎం శివప్రసాద్

మదనపల్లె రూరల్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని వీసీకే పార్టీ రాష్ట్రనేత పీటీయం.శివప్రసాద్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం స్థానిక వీసీకే కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైకి చెప్పు విసిరి అవమానపరచిన సంస్కారహీనుడైన న్యాయవాది చర్యను విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే) పార్టీ తరపున ఖండిస్తున్నట్లు తెలిపారు. మతోన్మాదం తలకెక్కిన ఆ న్యాయవాది, వృత్తి అనుమతిని తక్షణమే రద్దు చేసి ఊపా చట్టం కింద అతడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీసీకే, బాస్ నాయకులు నీరుగట్టిరమణ, సొన్నికంటి రెడ్డెప్ప, దేగానిరమణ, తెట్టుశ్రీనివాసులు, గూడుపల్లె గంగులప్ప, రవిశంకర్, తలారికృష్ణ, బురుజురెడ్డిప్రసాద్, శంకర్, బురుజు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై, ఒక న్యాయవాది కోర్టులోనే దాడికి యత్నించిన అమానుష ఘటనను నిరసిస్తూ బహుజన యువసేన(బీవైఎస్) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు జిలానీబాషా, హరికృష్ణ, వినయ్, లోకేష్, శశికుమార్, సాయికిరణ్, త్రిలోక్, సంతోష్, జగదీష్, బాలకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య

పీలేరు/ కలికిరి : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయిపై న్యాయవాది రాకేష్‌కుమార్ దాడి చేయడం హేయమైన చర్య అని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం పీలేరు, కలికిరిలో అంబేడ్కర్ విగ్రహాన్ని పూలమాలలు వేసి అనంతరం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు టి. ధరణికుమార్, మౌలా, టి.ఎల్. వెంకటేష్, పాలకుంట శ్రీనివాసులు, గండికోట వెంకటేష్, సుభాష్, సుధాకర్‌బాబు, నరసింహులు, మల్లికార్జున, గట్టప్ప, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు బాధ్యత పెంచింది




అవార్డు అందుకుంటున్న వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, అవార్డు అందుకుంటున్న సర్పంచ్ మనోహర్‌రెడ్డి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రమేష్‌బాబు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర అవార్డుకు ఎంపిక కావడం బాధ్యత పెంచిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, నిమ్మనపల్లె మెడికల్ ఆఫీసర్ డాక్టర్.రమేష్ బాబు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఈ విభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు జిల్లాలోని ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేయగా, నిమ్మనపల్లె పీహెచ్‌సీ మొదటిస్థానం సాధించిందన్నారు. రాయచోటిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ నిశాంత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించారని, అలాగే ఆస్పత్రిలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి ఉంచామన్నారు. అవార్డు రావడంతో తనతోపాటు ఆస్పత్రి వైద్య సిబ్బంది మరింత మెరుగ్గా పనిచేసేందుకు కృషి చేస్తామన్నారు.

తెట్టు గ్రామానికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

కురబలకోట: మండలంలోని తెట్టు గ్రామానికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. వైఎస్సార్ సీపీ మండల కీలక నాయకులు, గ్రామ సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ మనోహర్‌రెడ్డిని అభినందించడంతో పాటు గ్రామాన్ని ఆదర్శవంతంగా నిలిపేందుకు మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని సర్పంచ్ మనోహర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ స్ఫూర్తితో మరింత గ్రామాభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

డాబా నిర్వాహకుడిపై కేసు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు సమీపంలోని మెయిన్ రోడ్డులో డాబా నిర్వహిస్తున్న రేవన గణేష్ (29)పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. బెల్టుషాపుల కట్టడిలో భాగంగా దాబాను తనిఖీ చేయగా అనధికారికంగా విక్రయాలకు నిల్వ ఉంచిన 29 కింగ్‌ఫిషర్ బీర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని ఎస్ఐ మంగళవారం తెలిపారు.

పౌష్టికాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం


పౌష్టికాహారంపై వివరిస్తున్న సూపర్‌వైజర్ రమణమ్మ

తంబళ్లపల్లె: పోషక విలువలు కలిగిన పౌష్టికాహారంతోనే పిల్లల్లో ఎదుగుదలతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ తెలిపారు. మంగళవారం కొటాల అంగన్‌వాడీ కేంద్రంలో సుపోషిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో పలు రకాల కూరగాయాలు, ఆకు కూరలతో తయారు చేసి వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లలకు పౌష్టికాహార విలువలను వివరించారు. పిల్లలకు బాలమృతాన్ని రోజూ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ, నాగరత్న, ప్రమీల, సుగుణ, లలిత పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంతో ఆరోగ్యం

పెద్దమండ్యం: మండలంలోని బండ్రేవు పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు బాలింతలు, చిన్నపిల్లల పోషక ఆహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. సీడీపీఓ సుజాత మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యం కోసం పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. అధిక బరువు వివిధ సమస్యలకు దారితీస్తుందన్నారు. అంగవ్వాడీలో ఇచ్చే పోషక ఆహారాన్ని వినియోగించుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. గర్భిణులు శ్రీమంతం నిర్వహించారు. సూపర్ వైజర్ నౌజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సంతాపం


మునిరాజ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామ కస్పాకు చెందిన కె.మునిరాజ(58) మృతి పట్ల పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. మునిరాజ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. మంగళవారం కుటుంబ సభ్యులు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని మునిరాజ మృతదేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ నీళ్ల భాస్కర్, మాజీ వైస్‌ఎంపీపీ రెడ్డినరసింహారెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ సురేష్, నాయకులు అప్పల్ల, ధర్మానందరెడ్డిలు పాల్గొన్నారు.

పరామర్శ

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం మండలం విఠలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంగిరెడ్డిగారి శ్రీరాములురెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం వారి ఇంటికెళ్ళి ఆయనను పరామర్శించి ఆరోగ్య స్థితిపై విచారించారు.

మధ్యాహ్నభోజనం తనిఖీ

రామసముద్రం : పాఠశాలలో వండే మధ్యాహ్నభోజనం నాణ్యతగా ఉండాలని ఈఓపీఆర్డీ గఫూర్ సూచించారు. మంగళవారం ఆయన అరికెల జెడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్నభోజన పథకాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు.

నకిలీ మద్యం కేసును సీబీఐతో విచారణ చేయించాలి

- సాక్ష్యాలు, ఆధారాలున్నా సూత్రధారులను కాపాడుతున్నదెవరు
- టీడీపీనేతలను వదిలి కూలీలను బలిచేస్తారా
- కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టిన వైఎస్సార్‌సీపీ నేతలు

మదనపల్లె: కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ములకలచెరువు నకిలీమద్యం కేసును సీబీఐకి అప్పగించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అనిబిసెంట్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. తంబళ్లపల్లె టీడీపీ నేతల ఆధ్వర్యంలో తయారుచేసిన నకిలీమద్యం రాష్ట్రమంతా సరఫరా చేసిన ములకలచెరువు నకిలీమద్యం వెనుక సూత్రధారులు ఎవరో తెలిసినా వారిని ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏడాదికాలంలో మరణించిన వారి మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. సాక్ష్యాలు,ఆధారాలులేకనే ఎంపీ మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం నిర్బంధించి వేధించిందని అన్నారు. ఇప్పుడు సాక్ష్యాలున్న నకిలీమద్యం తయారీ కేసులో ఎవరినీ అరెస్ట్ చేయకుండా ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు.

మీ అభివృద్ధి ఎక్కడ ?

గత ఐదేళ్లలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఒక్కపని చేయలేదని జయచంద్రారెడ్డి విమర్శించడంపై మండిపడ్డారు. వందలకోట్లతో జరిగిన అభివృద్ధి, వేలకోట్లతో చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టులు కళ్లముందు కనిపిస్తున్నాయన్నారు. నకిలీమద్యంతో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడిన మీరా అభివృద్ధి గురించి ప్రశ్నించేది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగంగా జిల్లా అధ్యక్షుడు, సర్పంచు ఉజ్జయిని సాంబశివ, జెడ్పీటీసీ రామచంద్ర, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్‌సీ.ఈశ్వర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలీ, మాజీఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు భీమగాని నాగిరెడ్డి, సుబ్బిరెడ్డి, పద్మశాలి కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పట్టాభిరాముడి పవిత్రోత్సాలు


మహాపూర్ణాహుతి యజ్ఞంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని మండపంలో ఆలయ పండితులు వేదమంత్రోశ్చరణలతో మహాపూర్ణాహుతి యజ్ఞం, కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణ, చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవము అంగరంగవైభవంగా నిర్వహించారు. దీంతో మూడు రోజులు పాటు జరిగిన పవిత్రోత్సవాలు ముగిశాయి. భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

పట్టాభిరాముని సేవలో మాజీ ఎమ్మెల్యే

టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలలో మంగళవారం ఉదయం పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించారు. చింతల ఆనందరెడ్డి, జే.క్రిష్ణమూర్తి ఆయన వెంట పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న స్కూల్‌గేమ్స్ పోటీలు


కబడ్డీ ఆడుతున్న పీలేరు–మదనపల్లె జట్లు

మదనపల్లె సిటీ: మదనపల్లె డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. విద్యార్థులు పోటాపోటీగా పోటీల్లో పాల్గొంటున్నారు. సోమవారం మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్–14,17 బాలబాలికల కబడ్డీ, వాలీబాల్,చెస్ పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీలను హెచ్‌ఎం చంద్రశేఖర్ ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ డివిజన్‌స్థాయి విజేతలు జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.కార్యక్రమంలో డివిజన్ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ భద్రయ్య, శివశంకర్, దిలీప్, నరేష్, మహేంద్రనాయక్, బాలాజీ,విజయకుమార్,సుదాకర్, వరలక్ష్మి, భారతి, ఉమా తదితరులు పాల్గొన్నారు. అండర్–17 వాలీబాల్ బాలుర విభాగంలో పెద్దమండ్యం విన్నర్స్‌గా, రామసముద్రం విన్నర్స్‌గా నిలిచారు. బాలికల విభాగంలో పీలేరు విన్నర్స్‌గా, రామసముద్రం, రన్నర్స్‌గా నిలిచారు. అండర్–14 బాలికల విభాగంలో పీలేరు విన్నర్స్‌గా, తంబళ్లల్లి రన్నర్స్‌గా గెలిచారు. అండర్–14 బాలుర విభాగంలో తంబళ్లపల్లె విన్నర్స్‌గా, పెద్దమండ్యం రన్నర్స్‌గా నిలిచారు.

జీఎస్టీ తగ్గించడంతో తగ్గిన ధరలు


మదనపల్లె: అవగాహన కల్పిస్తున్న అధ్యాపకురాలు శివపార్వతి


కేవీపల్లె: జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓలు

మదనపల్లె సిటీ: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అనేక వస్తువులు ధరలు తగ్గుముఖం పట్టినట్లు ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం కాలేజీలో జీఎస్టీ స్లాబులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనేక వస్తువులపై జీఎస్టీ లేకుండా 0 % కు తగ్గించడం జరిగిందన్నారు. అదే విధంగా 5% 12% అనే రెండు స్లాబులు మాత్రమే ప్రకటించడం సామాన్య,మధ్య తరగతి వారికి అనేక వస్తువులు ధరలు తగ్గడానికి కారణమైందన్నారు. ఎకనామిక్స్ లెక్చరర్ శివపార్వతి అనేక ఆర్థిక విషయాలు, సామాజిక విషయాలను వృద్ధిరేటును తెలియజేశారు. కామర్స్ లెక్చరర్ వెంకటరమణ వ్యాపార పారిశ్రామిక సామాజిక రంగాలలో జీఎస్టీ ప్రభావాన్ని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయిశంకర్ రెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి,సేగు రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన జీఎస్టీ విధానంపై విద్యార్థులకు అవగాహన

కేవీపల్లె : నూతన జీఎస్టీ విధానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌లో భాగంగా విద్యార్థులకు, అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఏపీ ఆదర్శ పాఠశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు జీఎస్టీపై అవగాహన కలిగి తమ తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని సూచించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శీనునాయక్, ఉపాధ్యాయులు చెన్నూరు బాలాజీ, షేర్‌భాను, బాల, మునిరత్నం, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.